భర్తృహరి నీతి శతకము

విద్యార్థుల కంఠస్థ పోటీలకు ప్రత్యేక ప్రచురణ

PAVANI
SEVA SAMITHI

శ్రీ పావని సేవా సమితి

శ్రీ సాయినిలయము

ఎస్.ఆర్.టి. 270, సనత్‌నగర్, హైదరాబాద్ 500 018

ఫోన్ : 23702898

భర్తృహరి నీతి శతకము - విషయసూచిక

విషయము	పద్యాలు	పేజీలు
మూర్ఖపద్ధతి	1 నుంచి 10	1 నుంచి 10
విద్వత్పద్ధతి	11 నుంచి 20	11 నుంచి 20
మాన శౌర్య పద్ధతి	21 నుంచి 30	21 నుంచి 30
అర్థ పద్ధతి	31 నుంచి 40	31 నుంచి 40
దుర్జన పద్ధతి	41 నుంచి 60	41 నుంచి 60
పరోపకార పద్ధతి	61 నుంచి 70	61 నుంచి 70
ధైర్య పద్ధతి	71 నుంచి 80	71 నుంచి 80
దైవ పద్ధతి	81 నుంచి 90	81 నుంచి 90
కర్మ పద్ధతి	91 నుంచి 100	91 నుంచి 100

తే. బోద్ధలగువారు మత్సరపూర్ణమతులు
ప్రబలగర్వవిదూషితుల్ ప్రభువు లెన్న
నితరమనుజు లబోధోపహతులు గాన
భావమున జీర్ణమయ్యె సుభాషితంబు 1

తా : లోకంలో తెలిసినవాళ్లు అసూయాగ్రస్తులై ఉన్నారు. రాజులో గర్వాంధులు. ఇక సామాన్యులకు సుభాషితం వినేంతటి తెలివితేటలు లేవు. కనుక నేను చెప్పదలచుకొన్న సుభాషితం నాలోనే నశించిపోయింది.

క. తెలియని మనుజుని సుఖముగఁ
దెలుపందగు, సుఖతరముగ దెలుపఁగవచ్చున్
దెలిసినవానిం, దెలిసియుఁ
దెలియని నరుఁ దెల్ప బ్రహ్మదేవుని వశమే 2

తా. తెలియని వారికి సులభంగా తెలియజేయవచ్చు. తెలిసిన వారికి ఇంకా సులభంగా తెలియజేయవచ్చు. కాని తెలిసింది కొంచేమేఐనా సర్వజ్ఞుడనని భావించే వ్యక్తిని బ్రహ్మదేవుడుకూడా రంజింప జేయజాలడు.

చ. మకరముఖాంతరస్థమగు మానికమున్ బెకలింపవచ్చు బా
యక చలదూర్మికానికరమైన మహోదధి దాటవచ్చు మ
స్తకమునఁ బూవుదండవలె సర్పమునైన భరింపవచ్చు మ
చ్చిక ఘటియించి మూర్ఖజనచిత్తముఁ దెల్ప నసాధ్య మేరికిన్ 3

తా. మొసలినోటిలో ఉన్న రత్నాన్నైనా ప్రయత్నించి బయటకు తీయవచ్చు. నిరంతరమూ పైకెగసే పెద్ద అలలుగల సముద్రాన్నైనా దాటవచ్చు. పామునైనా పూదండవలె తలపై ధరింపవచ్చు. కాని ఆసక్తి కలిగించి మూర్ఖుని మనస్సును సమాధాన పెట్టడం మాత్రం సాధ్యం కాదు.

తే. తివిరి యిసుమునఁ దైలంబుఁ దీయవచ్చుఁ
దవిలి మృగతృష్ణలో నీరు ద్రావవచ్చుఁ
దిరిగి కుందేటి కొమ్ము సాధింపవచ్చుఁ
జేరి మూర్ఖుల మనసు రంజింపరాదు. 4

తా.. శ్రమపడి ఏదోవిధంగా ఇసుకనుండి కూడా చమురు తీయవచ్చు. ఎండమావులలోకూడా నీటిని సంపాదించి తాగవచ్చు. తిరిగి తిరిగి కుందేటి కొమ్మునుకూడా సంపాదించవచ్చు. కాని మూర్ఖుని మనస్సును మాత్రం రంజింపజేయడం సాధ్యం కాదు.

మ. కరిరాజున్ బిసతంతుసంతతులచేఁ గట్టన్ విజృంభించువాఁ
డురువజ్రంబు శిరీషపుష్పములచే నూహించు భేదింపఁ దీ
పు రచింపన్ లవణాబ్ధికిన్ మధుకణంబుంజింద యత్నించు ని
ద్ధరణిన్ మూర్ఖులఁ దెల్పు నెవ్వఁడు సుధాధారానుకారోక్తులన్ 5

ప్ర. తియ్యని మాటలతో మూర్ఖులను సమాధాన పెట్టదలచేవాడు మదపుటేనుగును తామరతూటి దారాలతో బంధింపదలచేవానితోనూ, దిరిసెనపువ్వులతో వజ్రాన్ని కోయదలచేవానితోనూ, ఉప్పు సముద్రంలోని నీటిని తియ్యగా చేయటానికి అందులో తేనె బొట్టు వేసేవానితోనూ సమానుడు.

తే. స్వవశము హితంబు మూఢతాచ్ఛాదనంబు
గాఁగ నీగతి నిర్మించెఁగమలభవుఁడు
సర్వవిదులగు సుజనుల సభలలోన
మౌనమె విభూషణము మూఢమానవులకు 6

తా. మూఢులు తమ మూఢత్వాన్ని కప్పిపుచ్చుకునేట్లుగా తమకు స్వాధీనమై ఉండేట్లుగా బ్రహ్మదేవుడు మౌనాన్ని సృష్టించాడు. పండితుల సభల్లో మౌనంగా ఉండటమే మూఢులకు అలంకారం.

చ. తెలివి యొకింత లేనియెడ దృప్తుఁడనై కరిభంగి సర్వమున్
దెలిసితి నంచు గర్వితమతిన్ విహరించితిఁ దొల్లి యిపుడు
జ్జ్వలమతులైన పండితుల సన్నిధి నించుక బోధశాలినై
తెలియనివాఁడనై మెలఁగితిం గతమయ్యె నితాంతగర్వమున్ 7

తా. కొద్ది పాటి జ్ఞానం మాత్రమే కలిగి ఉన్నప్పుడు మదగజంలాగా మదించి నేనే సర్వజ్ఞుణ్ణని భావించినాను. తరువాత మేధావంతులైన పెద్దలవల్ల కొద్దికొద్దిగా జ్ఞానాన్ని సంపాదించుకొన్న తరువాత నాకేమీ తెలియదనీ, మూర్ఖుణ్ణనీ భావిస్తూ పూర్వపుగర్వాన్ని వదలి సుఖంగా ఉన్నాను.

చ. క్రిమిసముదాయసంకులము కేవలనింద్యము పూతిగంధహే
యమును నిరామిషంబును ఖరాంగభవంబగునెమ్ము(గుక్క దా
నములుచు(జెంతనున్న సురనాథుని(గన్గొని సిగ్గు(జెంద ద
ల్పమని నిజస్వభావము(దలంపదు నీ చపు(బ్రాణి యెయ్యెడన్ 8

తా. పురుగులు కలది, నిందింపదగినది, దుర్గంధంతో రోతపుట్టించేది, మాంసంలేనిది ఐన గాడిద ఎముకను కుక్క అతిప్రీతితో నములుతూ తన సమీపానికి దేవేంద్రుడు వచ్చి నిలిచినా చూచి సిగ్గుపడదు. నీచప్రాణి తాను గ్రహించిన వస్తువు తుచ్ఛమా కాదా అనే విషయాన్ని లెక్కసేయదు కదా!

శా. ఆకాశంబుననుండి శంభుని శిరం బందుండి శీతాద్రి సు
శ్లోకంబైన హిమాద్రినుండి భువి భూలోకంబునందుండి య
స్తోకాంభోధిఁ బయోధినుండి పవనాంధోలోకముం జేరె గం
గాకూలంకష పెక్కుభంగులు వివేకభ్రష్టసంపాతముల్ 9

తా. గంగానది మొదట ఆకాశంనుండి ఈశ్వరుని తలమీద, అక్కడినుండి హిమవత్పర్వతం మీద, ఆ పర్వతంనుండి భూమిమీద, భూమినుండి సముద్రానికి, సముద్రంనుండి పాతాళానికి చేరుకుంది. వివేకభ్రష్టులైన వారికి ఇదేవిధంగా అనేకవిధాలైన పాట్లు సంభవిస్తాయి.

చ. జలముల నగ్ని ఛత్రమునఁ జండమయూఖుని దండతాడనం
బుల వృషగార్దభంబులను బొల్పగు మత్తకరీంద్రమున్ సృణిం
జెలఁగెడు రోగ మౌషధముచే విషముందగు మంత్రయుక్తి ని
మ్ములఁదగఁ జక్కఁజేయనగు మూర్ఖుని మూర్ఖత మాన్పవచ్చునే 10

తా. నిప్పును నీటితో చల్లార్పవచ్చు. సూర్యుని ఎండబాధను గొడుగుతో నివారించుకోవచ్చు. ఎద్దులు, గాడిదలు - వీటి బాధలను కర్రదెబ్బలతో తప్పించుకోవచ్చు. ఎద్దులు,, మదించిన ఏనుగును అంకుశంతో అదుపులో ఉంచుకోవచ్చు. నానాటికీ వృద్ధి పొందుతున్న రోగాన్ని మందులతో నివారించుకోవచ్చు. విషబాధను మంత్రప్రయోగంతో పోగొట్టుకోవచ్చు. కాని మూర్ఖుని మూర్ఖత్వాన్ని మాత్రం పోగొట్టడం సాధ్యం కాదు.

చ. సకలకళావిభూషితులు శబ్దవిదుల్ నయతత్త్వబోధకుల్
ప్రకటకవీంద్రు లేనృపతి పజ్జను నిర్ధనులై చరింతు రా
వికృతపుజాడ్య మాదొరది విత్తము లేకయ వారు పూజ్యు లం
ధకజనదూషితంబులు ఘనంబులు గావె యమూల్యరత్నముల్11

తా. సమస్తశాస్త్రాలచే అలంకరింపబడినవారు, శబ్దశాస్త్రముఅనగా వ్యాకరణశాస్త్రము నెఱిగినవారు, నీతి తత్వాన్ని (శిష్యులకు)బోధించువారును, ఐన ప్రసిద్ధులైన కవిశ్రేష్ఠులు ఏరాజు ఆస్థానంలో ధనహీనులై ఉంటారో ఆ హీనస్థితి ఆ రాజుదేకాని కవులదేమాత్రమూ కాదు. ధనం లేకున్నా వారు పూజ్యులే. రత్నాలయొక్క అమూల్యమైన విలువ తెలియని గుడ్డివాడు వాటిని పారవేసినంతమాత్రాన వాటి విలువ ఏమాత్రమైనా తగ్గుతుందా?

ఉ. హర్తకుఁగాదు గోచర మహర్నిశమున్ సుఖపుష్టిసేయు స
త్కీర్తి ఘటించు విద్య యను దివ్యధనం బఖిలార్థికోటికిం
బూర్తిగ నిచ్చినన్ బెగురుఁగుఁ బోదు యుగాంతపువేళనైన భూ
భర్తలు తద్ధనాధికులపట్టున గర్వము మాను టొప్పగున్ 12

తా. విద్యాధనాన్ని దొంగలు హరింపలేరు. సర్వవేళలా అది సుఖాన్నే కలిగింప జేస్తుంది. కోరినవారికందరికీ ఇస్తున్నా తరుగక ఇంకా వృద్ధి చెందుతూనే ఉంటుంది. ప్రళయకాలంలో కూడా నశించదు. ఇట్టి విద్యాధనం ఉన్న వారియెడ రాజులు గర్వాన్ని వదలుకోవడం సముచితం.

తే. ప్రభువులు పండితులగువారి వలన గర్వ
కలన మానుఁడు వారు మీ కలిమి తృణము
లీలఁబోలింపలేమి మృణాళగుణము
భూరిమదవారణములకు వారణంబె 13

తా. ప్రభువులారా! పండితులపై గర్వాన్ని ప్రదర్శించడం మానుకోండి. వారు మీ సంపదను గడ్డిపోచతో సమానంగా కూడా సరిపోల్చరు. అత్యధికమదం కల ఏనుగులను తామరతూటితో బంధించడం సాధ్యం కాదు కదా!

చ. వనజభవుండు కోపమున వాహనమైన మరాళభర్తకున్
వనజవనీవిహారకలనంబు దొలంగఁగఁ జేయుఁగాని గుం
భనమున దుగ్ధజీవనవిభాగవిధాననిరూఢనైపుణీ
జనితమహాయశోవిభవసారము హంసకు మాన్పఁజాలునే. 14

తా. బ్రహ్మదేవునికి తన వాహనమైన హంసమీద కోపం వస్తే దానిని తామరలవనంలో విహరించ కుండా చేయగలడే కాని దానికి పాలనూ, నీటినీ వేర్పాటు చేయడంలో గల నైపుణ్యంవల్ల కలిగిన గొప్ప కీర్తి వైభవాన్ని మాత్రం మాన్పగలడా?

ఉ. భూషలు గావు మర్త్యులకు భూరిమయాంగదతారహారముల్
భూషితకేశపాశమృదుపుష్ప సుగంధజలాభిషేకముల్
భూషలుగావు పూరుషుని భూషితుఁజేయుఁ బవిత్రవాణి వా
గ్భూషణమే సుభూషణము భూషణముల్ నశియించు నన్నియున్.15

తా. బంగారపు భుజకిరీటాలు, ముత్యాలహారములు, చక్కగా అలంకరింపబడిన కొప్పు, మృదువైన పుష్పాలు, సుగంధపునీటితో స్నానం - వీటిలో ఏ ఒక్కటీ మానవునికి నిజమైన అలంకారాలు కావు. పవిత్రమైన వాక్కు మాత్రమే మానవుని అలంకరించునది. వాక్కు మానవులకు చక్కని అలంకారం. ఇతర అలంకారాలన్నీ కూడా తాత్కాలికాలే.

ఉ. విద్య నిగూఢగుప్తమగు విత్తము రూపముపూరుషాళికిన్
విద్య యశస్సుభోగకరి విద్యగురుండు విదేశబంధుఁడున్
విద్య విశిష్టదైవతము విద్యకుసాటి ధనంబు లే దిలన్
విద్య నృపాలపూజితము విద్య నెఱుంగనివాఁడు మర్త్యుఁడే 16

తా. విద్య పురుషునికి రహస్యంగా దాచిపెట్టబడిన ధనం. విద్యయే సౌందర్యం విద్యయే యశస్సునూ, భోగాలనూ కలిగిస్తుంది. విద్యయే గురువు వలె అన్నింటినీ బోధిస్తుంది. పరదేశంలో చుట్టంలాగా సహాయం చేస్తుంది. విద్యయే పరదైవతం. ప్రపంచంలో విద్యకు సమానమైన ధనం మరొకటి లేదు. విద్యయే రాజసభల్లో పూజింపబడుతుంది. కనుక విద్య రానివాడు మరణించిన వానితో సమానుడే.

ఉ. క్షమ కవచంబు, క్రోధ మది శత్రువు, జ్ఞాతి హుతాశనుండు, మి
త్రము దగుమందు, దుర్జనులు దారుణపన్నగముల్, సువిద్య వి
త్త, ముచితలజ్జ భూషణ, ముదాత్తకవిత్వము రాజ్య, మీ క్షమా
ప్రముఖపదార్థముల్ గలుగుపట్టున(దత్కవచాదు లేటికిన్ 17

తా. ఓర్పు ఉంటే కవచం అక్కరలేదు. క్రోధముంటే హాని కలిగించడానికి శత్రువుతో పనిలేదు. దాయాది ఉంటే వేరే నిప్పు అక్కరలేదు. స్నేహితుడుంటే ఔషధం అక్కరలేదు. దుష్టులుంటే భయంకరమైన సర్పాలు అక్కరలేదు, ఉదాత్తమైన కవిత్వం ఉంటే రాజ్యంతో పనిలేదు. చక్కని విద్య ఉంటే సంపదతో ప్రయోజనం లేదు. తగురీతిని సిగ్గుఉంటే వేరే అలంకారం అక్కరలేదు. ఈ ఓర్పు మొదలైన పదార్థాలు ఉన్న పక్షంలో కవచం మొదలైన వాటితో ప్రయోజనం లేదు.

చ. వరకృపభృత్యులందు, నిజవర్గమునం దనుకూలవృత్తి, కా
పురుషులయందు శాఠ్యము, సుబుద్ధులయం దనురక్తి, దాల్మి స
ద్గురువులయందు, గౌరవము కోవిదులందు, నయంబు రాజులం,
దరిజనులందు శౌర్యము, మృగాక్షులయందుఁ బ్రగల్భభావ మీ
వరుసఁగళాప్రవీణు లగువారలయందు వసించు లోకముల్ 18

తా. సేవకులయెడ దయను, బంధువులయెడ అనుకూలవర్తనాన్ని, దుష్టజనులయెడ అప్రియకారిత్వాన్ని, సజ్జనులయెడ ప్రీతిని, పెద్దలయెడ ఓర్మిని, పండితులయెడ గౌరవాన్ని, రాజుల విషయంలో నీతిని, శత్రువుల యెడ పరాక్రమాన్ని, స్త్రీలయెడ దిట్టతనాన్ని - ఈ విధంగా ఆయావ్యక్తుల యెడ ఆయా గుణాలను ప్రదర్శించే కళల్లో నిపుణులైన వారిలోనే లోకాలు నివసిస్తాయి. అంటే అలాంటి వారే లోకస్థితికి కారకులని భావం.

తే. సత్యసూక్తి ఘటించు, ధీజడిమ మాన్చు
గౌరవ మొసంగు, జనులకుఁ గలుష మడుఁచుఁ
గీర్తిఁ బ్రకటించు, చిత్తవిస్ఫూర్తిఁజేయు
సాధుసంగంబు సకలార్థసాధనంబు. 19

తా. సజ్జనసహవాసం సత్యవాక్యాలనే పలికింపజేస్తుంది. బుద్ధి మాంద్యాన్ని పోగొడుతుంది. గౌరవాన్ని కలిగిస్తుంది. పాపాలను దూరంచేస్తుంది. కీర్తిని వ్యాపింపజేస్తుంది. మనోవికాసాన్ని కలిగింప జేస్తుంది. సజ్జన సహవాసం సమస్త ప్రయోజనాలనూ సాధిస్తుంది.

క. సుకృతాత్మలు రససిద్ధులు
సుకవీంద్రులువిజయనిధులు సుమ్మ తదీయా
ధిక కీర్తిశరీరంబులు
ప్రకటజరామరణజన్మ భయరహితంబుల్ 20

తా. ఆయా రసాలకు అనుగుణంగా వర్ణించే నైపుణ్యం కలవారు, చక్కని కృతులు రచించి ధన్యాత్ములైనవారు - ఐన కవీశ్వరులు - పండిత ప్రకాండులు తమ కీర్తి శరీరాలతో సిద్ధౌషధసేవచే జరామరణాలను అతిక్రమించిన యోగులవలె సర్వదా ప్రకాశిస్తూ ఉంటారు.

ఉ. గ్రాసము లేక స్రుక్కి జ రాకృశమైన విశీర్ణమైన సా
యాసము నైన నష్టరుచి యైనను బ్రాణభయార్తమైన ని
స్త్రాసమదేభకుంభపిశిత గ్రహలాలసశీలసాగ్రహా
గ్రేసరభాసమాన మగు కేసరి జీర్ణతృణంబు మేయునే? 21

తా. అభిమానంకల జంతువుల్లో అగ్రేసరమైన సింహం ఆకలితో డస్సినా, ముదిమితో చిక్కినా, కీళ్లు సడలినా, కష్టస్థితిని పొందినా, కాంతివిహీనమైనా, ప్రాణాపాయస్థితిలో ఉన్నా మదించిన ఏనుగు కుంభస్థలాన్ని పగులగొట్టి అందులోని మాంసాన్ని తింటుందేకాని ఎండుగడ్డిని తింటుందా?

ఉ. స్నాయువసావ సేకమలినమ్మగు నెమ్ము గ్రహించి జాగిలం
బాయతమోదమందుఁ జన దాఁకలి దానికిఁ జెంత నున్న గో
మాయువు దానిఁజూచి పరిమార్పక సింగము దంతిఁగూల్చునే
చాయల నెల్లవారు నిజ సత్త్వసమానఫలార్థులే కదా 22

తా. కుక్క మాంసరహితమై సన్నని నరాలు, కొద్దిపాటి కొవ్వు కలిగి మలినమైన ఎముక దొరికినంతనే ఎంతో సంతోషాన్ని పొందుతుంది. కాని ఆ ఎముక దాని ఆకలిని కొంచెమైనా తీర్చదు. సింహం తన యెదుట నక్కలు తిరుగాడుతున్నా వాటిని చంపక ఏనుగునే పట్టి చంపుతుంది. కనుక జనులు కష్టకాలంలో కూడా తమ శక్తికి తగిన లాభాన్నే కోరుతారు. కాని ఎచ్చుతగ్గులు కోరరు.

ఉ. వాలముఁ ద్రిప్పు నేలఁబడి వక్త్రముఁగుక్షియుఁజూపుఁగ్రిందటం
గాలిడుఁ ద్రువ్వుఁ బిండదుని కట్టెదుటన్ శునకంబు భద్రశుం
డాలము శాలితండులగుడంబులు చాటువచశ్శతంబుచే
నోలి భుజించు ధైర్యగుణయుక్తిగఁ జూచు మహోన్నతస్థితిన్ 23

తా. కుక్క తనకు పిడికెడన్నం పెట్టేవానియెదుట తోకనాడిస్తుంది. నేలపైపడి నోరూ, కడుపూ చూపిస్తుంది. కింద కాలిడి నేలను తవ్వుతుంది. గజరాజుమాత్రం ధైర్యంతో చూస్తూ ఎంతో గొప్పగా మావటివాడిచేత ప్రియవాక్యాలతో లాలింపబడుతూ ఆహారాన్ని గ్రహిస్తుంది.

తే. ప్రాణిలోకంబు సంసారపతిత మగుట
వసుధపై గిట్టి పుట్టనివాఁడు గలఁడె
వాని జన్మంబు సఫల మెవ్వానివలన
వంశ మధికోన్నతి వహించి వన్నెకెక్కు 24

తా. చావుపుట్టుక లనేవి ఎప్పుడూ ఉన్న ఈ సంసారంలో చచ్చిన వాళ్ళంతా మళ్ళీ పుడుతూనే ఉన్నారు. అలా పుట్టినవాళ్ళంతా మళ్ళీ నశించిపోతూనే ఉన్నారు. కాని ఎవని పుట్టుకవల్ల వంశం కీర్త్యాదులతో పేరుకెక్కుతుందో వాడే జన్మించిన వాడు. వాని జన్మే ధన్యం.

తే. కుసుమగుచ్ఛంబునకుఁ బోలెఁ బొసఁగు శౌర్య
మానవంతున కివి రెండు మహితగతులు
సకలజనమస్తక ప్రదేశములనైన
వనమునందైన జీర్ణభావంబుఁ గనుట 25

తా. శౌర్యమూ, అభిమానమూ కలవానికి పూలగుత్తి వలె అందరిచేత శిరసావహింపబడడమో - లేక ఏ అడవిలో మ్రగ్గిపోవడమో - ఈ రెండు గతులే కాని మరో గతి లేదు.

మ. గురుముఖ్యుల్ గల రేవురార్వ్యరు శుభాంగుల్ ఖేచరుల్ వారితో
వరవిక్రాంతవిహారి రాహు వెపుడున్ వైరంబు సేయండు భా
స్వరులన్ భాస్కరయామినీచరులనే బాధించుచున్నాఁడు త
త్పరతన్ మస్తకశేషమూర్తి యగు నా దైత్యుండు గర్వంబునన్ 26

తా. బృహస్పతి మొదలైన గణనీయములైన ఐదాఉగ్రహాలున్నా ఎంతో పరాక్రమంతో విహరించే రాహువు వారి తెరువువెళ్లక తలమాత్రమే మిగిలినవాడైనా తేజోవంతులగు సూర్యచంద్రులను మాత్రమే పీడిస్తున్నాడు.

మ. భువనశ్రేణి వహించు శేషుఁడు ఫణాభోగంబుపై సంతతం
బవలీలన్ భరియించుఁ బృష్ఠమునఁగూర్మాధీశ్వరుండాతనిన్
ధవళక్రోడవశాత్ముఁజేయు నతనిన్ వారాశి యశ్రాంతిచే
నవురా! ధీరచరిత్ర సంపద లసంఖ్యాతప్రభావోన్నతుల్ 27

తా : ఆదిశేషుడు పద్నాలుగు లోకాలను తన పడగలతో మోస్తున్నాడు. అతణ్ని ఆది కూర్మమూర్తి మూపున వహిస్తున్నాడు. సముద్రుడు ఆ ఆదికూర్మాన్ని ఆదివరాహునికి లోబడినవాణ్నిగా చేస్తున్నాడు. కావున మహాత్ముల మహిమలు అనేక ప్రభావాలతో కూడి సమున్నత మైనవిగా ఉంటాయి.

చ. సమధికభీషణజ్వలన జాలవినిర్గమదుస్సహంబుచే
సమదసురేంద్రముక్తకులిశక్షతిచే నుచితంబు ప్రాణఘా
తము హిమవత్కుమారునకుఁ దండ్రి నిశాతశతారపాతఖే
దమున మునుంగుచున్న తఱిఁ దా జలరాశిఁ జొరంగ నర్హమే. 28

తా. హిమవంతునికుమారుడగు మైనాకునికి మిక్కిలి భయంకరమైన నిప్పులు గక్కుచు సహింపశక్యముగాకున్న ఇంద్రుని వజ్రాయుధపుదెబ్బతో చావడమే మేలు కాని తన తండ్రి వజ్రాయుధవు తీక్ష్ణమైన దెబ్బల బాధలో మునిగి ఉండగా అతణ్ని విడిచి తాను సముద్రంలోకి వెళ్ళి దాగుకోవడం తగుతుందా?

తే. అర్కకాంత మచేతనంబయ్యు సవితృ
పాదములు సోఁకినంతనె ప్రజ్వరిల్లుఁ
గాన నభిమానవంతుఁడెందైన శత్రు
కృతతిరస్కార మెట్లు సహింప నేర్చు? 29

తా. సూర్యకాంతమణి అచేతనమైనప్పటికీ సూర్యునికిరణాలు సోకగానే మండిపోతుంది. (సూర్యుని పాదాలు తనపై పడినతోడనే కోపోద్రిక్తమౌతుంది అని అర్థాంతరం) అభిమానవంతులు ఇతరుల వల్ల కలిగే పరాభవాన్ని సహించి ఊరకుండరు.

క. విదిలింప నుఱుకు సింగపుఁ
గొదమయు మదమలినగండకుంజరములపై
నిది బలశాలికి నైజము
గత తేజోనిధికి వయసు కారణ మగునే 30

తా. సింహం బాల్యదశలో ఉన్నా, మదజలంతో మలినమైన చెక్కిళ్లుగల ఏనుగులను ఛేదించడానికి పరుగెత్తుతుంది. ఇది బలవంతులకు ప్రకృతి సిద్ధమైన గుణం. పరాక్రవంతులకు వయసుతో పని లేదు.

ఉ. జాతి దొలంగుఁ గాత, గుణశక్తి రసాతలసీమకుం జనుం
గాత, కులంబు బూది యగుఁగాత, నగంబుననుండి శీలముం
బాతముఁ జెందుఁగాత, బహుభంగుల విత్తమె మాకు మేలు వి
ఖ్యాతగుణంబు లేలఁ దృణకల్పము లొక్క ధనంబు లేవడిన్ 31

తా. జాతి భ్రష్టం కానీ, గుణాల అడుగంటనీ, మంచి నడవడి ఉన్నతస్థానం నుండి భ్రష్టం కానీ, కులం తగలబడి బూడిద కానీ, మాకేమీ లోపంలేదు. మాకు కావలసింది - మేలు కలిగించేది ధనం. అది ఒక్కటి ఉంటే చాలు. అది లేని పక్షంలో పైన చెప్పిన గుణాలన్నీ గడ్డిపోచతో సమానం.

క. ఏ నరునకు విత్తము గల,
దా నరుఁడు కులీను, డధికుఁ, డార్యుఁడతండే
ధీనిధి, ధన్యుఁడు, నేర్పరి,
నానాగుణగణము కాంచనంబున నిలుచున్ 32

తా. లోకలంలో ధనం కలవాడే కులీనుడుగా, గొప్పవాడుగా పూజ్యుడుగా, పండితుడుగా, ధన్యుడుగా, నేర్పరిగా భావింపబడతాడు. ధనమొక్కటి ఉంటే చాలు పై ఏ గుణాలూ లేకపోయినా వానిలో ఈ గుణాలన్నీ ఉన్నట్లుగా జనులు భావిస్తారు.

మ. యతి సంగంబున, బాలుఁడాదరముచే, జ్యా భర్త దుర్మంత్రిచే,
శ్రుతిహానిన్ ద్విజుఁ, డన్వయంబు ఖలుచేఁ, గ్రూరాప్తిచే శీల, ము
ద్ధతిచే మిత్రత, చూపులేమిఁ గృషి, మ ద్యప్రాప్తిచే సిగ్గు, దు
ర్మతిచే సంపదలున్ నశించుఁ, జెడు నర్థంబుల్ ప్రమాదంబునన్ 33

తా. సాంగత్యంతో సన్యాసి, లాలనవల్ల కుమారుడు; చెడ్డ మంత్రివల్ల రాజు, వేదాధ్యయనం లేకపోవడం వల్ల బ్రాహ్మణుడు, కుపుత్రుని వల్ల వంశం, దుర్మార్గుల పొందువల్ల శీలం గర్వం వల్లస్నేహం, తఱచుగా చూడకపోవడం వల్ల వ్యవసాయం, మద్య సేవనం వల్ల సిగ్గు, చెడుబుద్ధులవల్ల సంపదలు, పరాకువల్ల ధనం నశిస్తాయి.

క. దానము భోగము నాశము
పూనికతో మూఁడుగతులు భువి ధనమునకున్
దానము భోగము నెఱుఁగని
దీనుని ధనమునకు గతి తృతీయమె పొసఁగున్ 34

తా. సత్పాత్రదానం, తాననుభవించడం, దొంగలు మొదలైనవాళ్లు హరించడం అని ధనానికి మూడు దశలు లోకంలో కనబడుతున్నాయి. ఎవడు సత్పాత్రునికి దానం చేయక, తాననుభవించక ఉంటాడో వాని ధనానికి మూడవగతే (అంటే దొంగలు మొదలైన వాళ్లు హరించడమే) పడుతుంది.

ఉ. శాణవిఘృష్టరత్నమును శస్త్రహతుండగు శూరుఁడున్ మద
క్షీణగజంబు సైకత విశిష్టశరన్నదియున్ నవక్షపా
ప్రాణవిభుండుచండసురతాలన బాలికయున్ ధనై కవి
శ్రాణనశూరులుం గడుఁగృశత్వమునం బ్రభఁగాంతు రిద్ధరన్ 35

తా. సానపెట్టబడిన మణి, ఆయుధాల దెబ్బలు తిన్నవాఁడు, మదజలస్రావంతో చిక్కిన ఏనుగు, శరత్కాలంలో ఎండిన ఇసుక తిన్నెలుగల నది, విదియనాటి చంద్రుడు, మిక్కిలి రతిచే డస్సిపోయిన బాలిక, సత్పాత్రదానం చేసి ధనాన్ని కోల్పోయినవారు ఎంత కృశించినా విశేషంగా ప్రకాశిస్తారు.

ఉ. చేరి యొకండు నొవ్వఁబడి చిక్కుచుఁ జేరెడు శాలిధాన్యమే
కోరు నతండు పిమ్మట నకుంఠ ధనోన్నతుఁడై వసుంధరం
బూరికి సాటిగాఁ దలఁచు భూరిధనాఢ్యుల చొప్పునేకమై
గౌరవమున్ లఘుత్వమును గైకొను వస్తువులందు నెల్లెడన్ 36

తా. దారిద్ర్యంలో ఉండి బాధలు పడుతున్నప్పుడు ఒక గుప్పెడు ధాన్యాన్ని కోరే వ్యక్తే కాలాంతరంలో ఐశ్వర్య వంతుడైతే భూమండలాన్నంతా గడ్డి పరకతో సమానంగా చూస్తాడు. కాబట్టి సమయానుసారంగా వస్తువులు గొప్పవిగాను అల్పమైనవిగాను భావింపబడతాయి. ఒకప్పుడు అల్పమైనది మరొకప్పుడు అధికంగానూ, అదే మళ్లీ అల్పమైంది గానూ కనిపిస్తుంది.

తే. ధరణిధేనువు(బిదుకంగ(దల(చితేని
జనుల(బోషింపు మధిప వత్సములమాడ్కి
జనులు పోషింప(బడుచుండ జగతి కల్ప
లత తెఱంగున సకలఫలంబు లొస(గు 37

తా. రాజా! గోవులాంటి భూమినుండి నీవు ధనాన్ని పిదుకదలచినట్లైతే ఆవు దూడను పోషించిన విధంగా ప్రజలను చక్కగా పోషించు. అలా చక్కగా పోషించినట్లైతే భూమి కల్పలత వలె నీవు కోరిన ఫలాలన్నింటినీ ఇస్తుంది.

తే. సత్య మనృతంబు పరుషోక్తి సరసభాష
ప్రాణిహింసయు దయము లోభంగు నీఁగి
కనకసంగ్రహవ్యయముల గలుగు వార
రమణికైవడి బహురీతి రాజనీతి 38

తా : రాజనీతి కొన్ని చోట్ల సత్యమిశ్రితంగానూ, కొన్ని చోట్ల అసత్యయుతంగానూ, ఒకచోట కఠినంగానూ; ఒకచోట చెవులకింపుగానూ; ఒకచోట బాధించేదిగానూ, మరోచోట దయను కనబరచేదిగానూ, ఒకచోట పిసినారితనాన్ని చూపేదిగానూ, మరొకచోట దానగుణం చూపేదిగానూ, ఒకచోట నిత్యమూ వ్యయం చేయించేదిగానూ మరొకచోట సంపాదించేదిగానూ - వేశ్యాంగనవలే నానావిధాలుగా ఉంటుంది.

తే. ఆజ్ఞయును గీర్తియును భూసురావనంబు
దానమును భోగ మిత్రసంత్రాణనములు
షడ్గుణంబులు గలుగవే జనులయందు
వారిఁ గొల్చిన ఫల మేమి వసుమతీశ 39

తా : శాసించడం, సత్కీర్తి, బ్రాహ్మణ పరిరక్షణం, సత్పాత్రదానం, సుఖానుభవం, ఆపన్నులైన మిత్రులను రక్షించడం - అనే ఈ ఆరు గుణాలు లేని రాజులను సేవించడం వల్ల లాభమేమీ ఉండదు.

చ. వనజభవుండు నెన్నొసట వ్రాసిన సొమ్ము ఘనంబొ కొంచెమో
వినుమరుభూమి కేఁగిన లభించును మేరువుఁజేరఁ బోయినన్
ధన మధికంబు రాదు కడు దైన్యము మాను ధనాఢ్యులందు న
వ్వననిధి నూతఁ దుల్యముగ వారిగ్రహించు ఘటంబు సూడుమా 40

తా. బ్రహ్మదేవుడు తన నొసట వ్రాసిన ధనం, కొద్దో గొప్పో, మానవుడు ఎడారి ప్రాంతంలో ఉన్నా లభిస్తుంది. మేరు పర్వతంపై ఉన్నా బ్రహ్మదేవుడు నొసట వ్రాసినదానికన్నా ఎక్కువ లభించదు. కనుక ధనవంతులను చూచి దైన్యాన్ని పొందడం కూడదు. కుండను సముద్రంలో ముంచినా, బావిలో ముంచినా అది నీటిని సమానంగానే గ్రహిస్తుంది కదా!

తే. కారణము లేని కలహంబు కరుణలేమి
పరవధూపరధనవాంఛ బంధుసాధు
జనములం దసహిష్ణుత్వ మనఁగ జగతిఁ
బ్రకృతి సిద్ధంబు లివి దుష్టనికరమునకు 41

తా. నిష్కారణంగా అందరితో జగడాలు పెట్టుకోవడం, దయలేకపోవడం, ఇతరుల ధనంమీదా, ఇతరుల స్త్రీలమీదా కోరిక ఉండడం, చుట్టాలనూ, సజ్జనులనూ సహించకపోవడం - ఈ లక్షణాలన్నీ దుర్జనులకు సహజంగా కలిగేవి.

తే. విద్యచే భూషితుండయి వెలయుచున్నం

దొడరి వర్జింప నగుఁజుమీ దుర్జనుండు

చారుమాణిక్యభూషిత శస్తమస్త

కంబు గల పన్నగము భయంకరము గాదె 42

తా. పాముతలపై అందమైన రత్నం ఉన్నా అది కాటువేస్తుందన్న భయంతో ఎలా దూరంగా ఉంచుతామో అదేవిధంగా దుర్జనుడు ఎంత విద్యావంతుడైనా అతణ్ని దూరంగా ఉంచుతాము.

శా. హ్రీరమ్యుం జడుఁగాఁగ, సువ్రతుని మాయింగా, శుచిందంభిఁగా,
శూరిన్ నిర్దయుఁగా, మునిన్ విమతిఁగా, శ్రోతప్రియాలావు ని
స్సారుంగా, బలవంతు గర్వితునిఁగా, సద్వక్త వాచాలుఁగా,
గ్రూరుండెన్న సుధీగుణంబు దురితారూఢంబు జేయుంగదా! 43

తా. మంచిని మంచిగా చూసే లక్షణం దుర్మార్గునికి ఉండదు. ప్రతి మంచిలోనూ దోషాన్ని చూడడమే అతని స్వభావం. లజ్జగలవానిని మందునిగాను, తపోవంతుణ్ని డంభముగలవాని గాను, శుచిగలవానిని వేషధారిగను, శూరుణ్ని దయాహీనునిగాను పేర్కొంటాడు. ఆత్మ స్వరూపాన్ని మననం చేసే మునిని బుద్ధిహీనుడని దూషిస్తాడు. ప్రియంగా మాట్లాడే వాణ్ని దీనునిగా గణిస్తాడు. తేజోవంతుణ్ని గర్విగా ప్రకటిస్తాడు. సభల్లో చక్కగా యుక్తి యుక్తంగా మాట్లాడేవాణ్ని వదరుబోతుగా భావిస్తాడు. ఇలా గుణవంతుల్లోని గుణాలనన్నింటినీ దోషాలుగా రూపిస్తాడు.

చ. వగగొను లోభముం బిశునభావము సత్యము చిత్తశుద్ధియుం
దగు సుజనత్వమున్ సుమహితత్వము విద్యయు లోక నిందయుం
దగిలిన, దుర్గుణంబు దురితంబు దపంబును దీర్థసేవ భృ
త్యగణము సొమ్ములుం ధనచయంబును జావు, నువేల యున్నవే? 44

తా : అత్యాశ ఒక్కటి ఉంటే చాలు ఇక వేరే దుర్గుణం అక్కరలేదు. చాడీకోరుతనం ఉంటే నరకంలో పడవేయడానికి మరో పాపంతో పనిలేదు. సత్యమొక్కటి ఉంటే వేరే తపస్సు అక్కరలేదు. చిత్తశుద్ధి ఉంటే తీర్థసేవ చేయవలసిన అవసరంలేదు. సౌజన్యం ఉంటే భృత్యగణంతో పనిలేదు. గొప్పతనం ఉంటే అలంకారాల అవసరంలేదు. విద్యఉంటే మరోధనం అక్కరలేదు. లోకనింద ఉంటే ఇక చావుతో పనిలేదు.

చ. దినమలినాంగుఁడైన హిమదీప్తియుఁ, బ్రాయము దప్పు నాతియున్,
వనరుహశూన్యమౌ కొలను, వర్ణితరూపు నిరక్షరాస్యమున్,
ధనపరుఁడైన రాజు సతతంబును లేమిని గుందు సాధువున్,
జనపతిచెంత దుర్జనుఁడు, శల్యము లే డివి నామనంబు నన్ 45

తా. దుర్జనుడు హృదయశల్యంలాగా ఎప్పుడూ భరింపశక్యంకాని దుఃఖాన్ని కలిగిస్తూ ఉంటాడన్న ఒక అనుభవజ్ఞుని అనుభవాన్ని కవి అప్రకృతమైన కొన్ని దృష్టాంతాలను పేర్కొని నిరూపిస్తున్నాడు.

క. మనుజులలో నెవ్వఁడు దగఁ
దనవాఁడనువాఁడు దుష్టధరణీశునకున్?
దనకయి వ్రేలిమి వ్రేల్చెడు
జనుని తనువుఁగాల్చు వాయుసఖుఁడదయుండై 46

తా. అగ్నిహోత్రుడు తన తృప్తికి ఆజ్యాదులను హోమం చేస్తున్నవానిని సైతం తాకినంత మాత్రాననే మొగమోటమి లేకుండా దహించివేస్తాడు. దుష్టులైన రాజులకు స్థిరంగా ప్రేమించదగినవాడంటూ ఎవ్వడూ ఉండదు. వారెంతటి హితకారినైనా ఇంచుక తప్పితే చంపించడానికి వెనుకాడరు.

ఉ. మౌనముచేత మూఁగయు, సమంచితవక్త ప్రలాపి, చెంగటం
బూని వసింప దిట్ట, దమముందట దువ్వగ నుండెనేని శా
లీనుఁడు, దాల్మి భీరుఁ, డవలిప్తుడు దాలిమి లేని బంటు, భూ
జానులసేవ దుష్కర మసాధ్యము యోగులకైన నిద్దరన్ 47

తా. సేవకుడు ఏమీ మాటాడకుండా ఉంటే మూగవాడని అంటారు. నేర్పుతో మాట్లాడితే అసంబద్ధ ప్రలాపి అని ~~ఈసడిస్తారు~~. దగ్గరగా చేరుకుంటే భయ భక్తులు లేనివాడని కసరుకుంటారు. దూరంగా ఉంటే చేతకాని దద్దమ్మగా భావిస్తారు. ఓర్పు వహిస్తే పిరికివాడని తలుస్తారు. ఓర్పులేక పోతే గర్వితుడని మందలిస్తారు. కనుక రాజులను సేవించడమనేది యోగులకుకూడా సాధ్యంకాదు.

చ. ఖలులగువారినెల్ల నధికారసమర్థులఁ జేసి, తా నిర
ర్గళగతియై నికృష్టనిజకర్మము విస్మృతిపా లొనర్చి, ని
శ్చలగుణవైరియై, విధివశంబున సంపద గాంచి త్రుళ్లుచున్
మెలఁగు నృపాలు దేశమున మేలు లభించునె యెట్టివారికిన్? 48

తా. దుర్జనులైవారికే అధికారాన్ని సమర్పించి ఇష్టము వచ్చినట్లుగా ప్రవర్తిస్తూ తన పూర్వపు నికృష్టమైన జీవితాన్ని మరచిపోయి గుణవంతులకు శత్రువై దైవయోగంచేత లభించిన సంపదతో కన్ను గానక ప్రవర్తించే రాజు రాష్ట్రంలో ఎవ్వరూ సుఖంగా ఉండలేరు.

మ. సుకృతి శ్రేష్ఠుల గోష్ఠియుం, బరగుణస్తోమంబునం బ్రీతి, దే
శికసం సేవయు, విద్యయందు రుచి స్వస్త్రీకేళి, లోకాపవా
దకథాభీతియు, శంభుభక్తి, దమనోద్యచ్ఛక్తియున్, సాధుదూ
షక సాంగత్యవిముక్తియుం, గల మనీషావంతులంగొల్చెదన్. 51

తా. సజ్జనుల సహవాసం, ఇతరుల సద్గుణాలపై ఆసక్తి, గురువులను సేవించడం, విద్యపై ఆసక్తి, స్వభార్యయందు సంభోగం, జనాపవాదమంటే భయం. ఈశ్వరుని యందు భక్తి, అవమానం కలిగినపుడు తన సామర్థ్యం చూపడం, సజ్జనులను దూషించేవారికి దూరంగా ఉండడం - ఈ సద్గుణాలు కలిగిన మహాత్ములకు నా నమస్కారాలు.

ఉ. ఆపదలందు ధైర్యగుణ, మంచిత సంపదలందుఁ దాల్మియున్
భూపసభాంతరాళమునఁ, బుష్కలవాక్చతురత్వ, మాజి బా
హాపటుశక్తియున్, యశము నందనురక్తియు, విద్యయందు వాం
ఛాపరివృద్ధియున్, బ్రకృతి సిద్ధగుణంబులు సజ్జనాళికిన్ 52

తా. ఆపదలు వచ్చినపుడు ధైర్యగుణం, ఐశ్వర్యం వచ్చినపుడు ఓర్పు, రాజసభలో వాక్పాటవం, యుద్ధంలో శౌర్యం చూపడం, కీర్తియందాసక్తి; విద్యార్జనయందు మిక్కుటమైన కోరిక ఆ గుణాలన్నీ సజ్జనులకు సహజసిద్ధమైన గుణాలు.

తే. మొదలఁజూచినఁగడు గొప్ప పిదపఁ గుఱుచ,
యాదిఁగొంచెము తర్వాత నధిక మగుచుఁ,
దనరు, దినపూర్వపరభాగ జనితమైన
ఛాయపోలికఁ గుజనసజ్జనుల మైత్రి 49

తా. దుర్మార్గుని స్నేహం ప్రాతకాలపు నీడవలె తొలుత విస్తారంగా ఉండి ఆ తరువాత క్రమ క్రమంగా క్షీణించి పోతుంది. సజ్జనుల మైత్రి సాయంకాలపు నీడవలె మొదట చిన్నదిగా ఉండి క్రమ క్రమంగా వృద్ధిపొందుతూ ఉంటుంది. కనుక ఈ రెండింటిలో ఏది యుక్తమో దానిని బుద్ధిమంతుడు గ్రహించాలి.

తే. కసవుచే నీటిచే మోదకలనచేత
బ్రదుకు మృగమీనసజ్జన ప్రకరమునకు
శబరకైవర్తసూచక జనులు జగతిఁ
గారణము లేని పగవారు గారె తలఁప 50

తా. పరులను పీడింపకుండానే గడ్డి పరకలతో కాలయాత్రను గడుపుకునే లేళ్ళు మొదలైన వాటికి బోయలు, నీటితో బ్రతికే చేపలకు జాలర్లు, దొరికినదానితో సంతోషించి కాలయాపన చేసే సజ్జనులకు కొండెగాండ్రు అకారణశత్రువులై కనిపిస్తుంటారు.

చ. కరమున నిత్యదానము, ముఖంబున సూనృతవాణి, యౌదలం
గురుచరణాభివాదన, మకుంఠిత వీర్యము దోర్యుగంబునన్
వరహృదయంబునన్ విశదవర్తన, మంచితవిద్య వీనులన్
సురుచిరభూషణంబు లివి శూరులకున్ సిరి లేనియప్పుడున్ 53

తా. చేతులకు ఎల్లప్పుడూ దానంచేసే గుణం నోటికి సత్యవాక్కను పలికే లక్షణం, శిరస్సుకు గురువులను నమస్కరించే గుణం; బాహువులకు ఎదురులేని పరాక్రమం కలిగి ఉండడమనే గుణం, మనస్సునకు అకలంకమైన ప్రవర్తన అనే లక్షణం, చెవులకు శాస్త్రశ్రవణం అనే గుణం ఇవి మహాత్ములకు ఐశ్వర్యం లేనప్పుడు సహజాలంకారాలుగ భావింపబడతాయి.

మ. పరహింసాపరకీయవిత్తహరణాభావంబు సత్యవ్రతా
దరముందానపరత్వ మన్యవనితోదంతోక్తి మూకత్వముం
బరతృష్ణార్ఘురభంజనంబు గురునమ్రత్వంబునుంబ్రాణభృ-
త్కరుణాశాస్త్రసమత్వసద్విధులు భద్రప్రాప్తికిన్ మార్గముల్ 54

తా : జీవహింసను వదలి, పరుల ద్రవ్యంపై మనసును పోనీక సత్యమే పలుకుతూ, దానాలు చేస్తూ, పరస్త్రీల విషయాలను గురించి ఏమీ పలుకక మౌనంగా ఉంటూ, సకల ప్రాణులపై దయాభావం చూపుతూ, సకల శాస్త్రాలను అధ్యయనం చేయడం - అనేదే సకలశ్రేయస్సులు పొందడానికి మార్గం.

తే. సంపదలు గల్గుతఱి మహాజనుల హృదయ
మభినవోత్పలకోమలం బగుచు వెలయు;
నాపదలు వొందునపుడు మహామహీధ
రాశ్మ సంఘాతకర్కశం బై తనర్చు 55

తా. సంపదలు కలిగినపుడు మహాత్ముల మనస్సులు కలువలవలె మృదువుగా ఉంటాయి. ఆపదలు వచ్చినపుడు మాత్రం పెద్దకొండరాలవలె కఠినంగా ఉంటాయి. అంటే సంపదలు వచ్చినపుడు గర్వించి కఠినంగా ప్రవర్తించరనీ, ఆపదలు వచ్చినపుడు వెలవెలబోరని భావం.

మ. అసమానప్రియనీతి వర్తనము ప్రాణాంతంబునందున్ మలీ
మస మగ్రాహ్యమదుష్టయాచన మసంపత్ప్రార్థనా భావమున్
వ్యసనావాప్తిని ధైర్యముంబుధజనాత్యంతానుకూలత్వ;మీ
యసిధారావ్రత చర్య యెవ్వఁడు మహార్యశ్రేణికిందెల్పెనో! 56

తా. న్యాయంగా ప్రవర్తించడం, మరణసమయంలోనూ చేయగూడని పనిని చేయకుండడం, దుర్జనులను యాచింపకుండడం, పేదవానిని ప్రార్థింపకుండడం, ఆపదల్లో ధైర్యమవలంబించడం, పండితులకు అనుకూలంగా ఉండడం - ఈ ధర్మాలను పాటించడం అసిధారావ్రతం లాంటిది. ఈ ధర్మాలన్నీ సజ్జనులకు స్వభావసిద్ధాలే కాని ఎవరో ఉపదేశిస్తే వచ్చేవి కావు.

మ. ప్రాసంగం దానము గుప్త, మర్థిభవనంబుం జేరుచో సంభ్రమో
ల్లసదుత్థానవిధానముం, బ్రియవిధుల్ గావించి మౌనంబు, రా
జసభన్ మిత్రకృతి ప్రకాశమును(, గుత్సాకర్మవైముఖ్య, మీ
యసిధారావ్రతచర్య యెవ్వ(డు మహార్యశ్రేణికిం దెల్పెనో! 57

తా. రహస్యంగా దానంచేయడం, అర్థులు (యాచకులు) ఇంటికి వచ్చినపుడు లేచి గౌరవించి వారి కోర్కెలు తీర్చడం, వారికి చేసిన మేలును ఇతరులకు చెప్పకుండా మౌనంగా ఉండడం, తనకు మిత్రులు చేసిన మేలును సభల్లో చెప్పడం, చెడు పనులకు దూరంగా ఉండడం - అనే ఈ అసిధారా వ్రత విధానాన్ని ఏ మహానుభావుడు ఆర్యులకుపదేశించినాడో కదా!

ఉ. నీరము తప్తలోహమున నిల్చి యనామకమై నశించు, నా
నీరమె ముత్యమట్లు నళినీదళ సంస్థితమై తనర్చు, నా
నీరమె శుక్తిలోఁబడి మణిత్వముఁగాంచు సమంచిత ప్రభం; బౌ
రుషవృత్తు లిట్లధము మధ్యము నుత్తముఁ గొల్చువారికిన్. 58

తా. కాలిన ఇనుముపై పడిన నీరు ఊరుపేరు లేక నశించి పోతుంది. ఆ బిందువే తామరాకు మీద పడినపుడు ముత్యంలాగా ప్రకాశిస్తుంది. ఆ బిందువే ముత్యపు చిప్పలో పడి చక్కని కాంతివంతమైన ముత్యంగా మారుతుంది. కనుక ఆశ్రయానుసారంగా నీచులు, మధ్యములు, ఉత్తములు, అనే పేరు వస్తుంది. అనగా నీచుల నాశ్రయించినవారికి సౌఖ్యాభాసమూ, ఉత్తముల నాశ్రయించిన వారికి వాస్తవసౌఖ్యమూ కలుగుతాయి.

చ. జనకునిఁ బూజలం గడుఁ బ్రసన్నుని జేయునతండు పుత్త్రుఁడే
వనిత మెలంగు భర్తృవశవర్తిని యై యది సత్కళత్రమే
జనుఁడు విపత్తిసౌఖ్యసదృశక్రియుఁ డాతఁడు మిత్త్రుఁడీత్రయం
బును జగతిన్ లభించుఁగడుఁ బుణ్యముఁజేసినయట్టివారికిన్ 59

తా. ఎవడు తన మంచి నడవడిచేత తండ్రిని సంతోషపెడతాడో వాడే నిజమైన పుత్రుఁడు. ఏ స్త్రీ భర్తకు ఆజ్ఞావర్తినియై ఉంటుందో ఆమే మంచి భార్య. ఎవడు ఆపత్సమయాల్లోనూ, దుఃఖసమయాల్లోనూ తగినవిధంగా ప్రవర్తిస్తాడో అతడే మంచి మిత్రుఁడు. ఇట్టి పుత్రుడు, భార్య, స్నేహితుడు ఎంతో పుణ్యం చేసుకున్నవారికి మాత్రమే లభిస్తారు.

చ. నతులగుచున్ మహోన్నతిఁ దనర్చుచు నవ్యగుణోక్తిచే గుణో
న్నతిఁ బ్రకటించుచున్, బరజనప్రియకార్యసమర్థతన్ సమం
చితనిజకార్యసంగ్రహముఁ జేయుచు, నిష్ఠురవాదులన్ క్షమా
ధృతి నిరసించుచుం, బరఁగు ధీరులు పూజ్యులు గారె యేరికిన్? 60

తా. సత్పురుషులు అణుకువ గలిగి ఉంటూనే ఔన్నత్యాన్ని పొందుతారు. పరుల గుణాలను శ్లాఘిస్తూనే తమ సహృదయత్వాన్ని చాటుకుంటారు. ఇతరుల కార్యసాఫల్యానికై ప్రయత్నిస్తూనే తమ కార్యాలను కూడా నిర్వహించుకుంటారు. కఠినంగా నిందించేవాళ్లపై ఓర్పు చూపుతూనే వారిని శిక్షిస్తారు. ఇట్టి ఆశ్చర్యకరమైన నడవడిగల మహాత్ములు ఎవరికి పూజ్యులు కారు? అందరికిని పూజ్యులే.

తే. తరువు లతిరసఫలభార గురుతఁగాంచు,
నింగి వ్రేలుచు నమృత, మొసంగు మేఘుఁ
డుద్ధతులు గారు బుధులు సమృద్ధిచేత
జగతి నుపకర్తలకు నిది సహజగుణము. 61

తా: వృక్షాలు ఫలకాలంలో వంగి ఉంటాయి. నీళ్లతో నిండినమేఘాలు బరువుచే క్రిందుగా వ్రేలాడుతూ ఉంటాయి. సత్పురుషులు సంపదలు వచ్చినపుడు గర్వం వహించరు. ఇది పరోపకారపరాయణుల స్వభావం ఈ నమ్రత, క్రిందుగా ఉండడం, గర్వం లేకుండడం - అనేవి పరోపకారులకు సహజగుణాలు.

తే. అమరుఁజెవి శాస్త్రమునఁ, గుండలమునఁగాదు
వలయమున నొప్ప, దీవిచే వెలయుఁబాణి
యురుదయాఢ్యుల మేను పరోపకార
కలన రాణించు గంధంబు వలనఁ గాదు. 62

తా : దయావంతులైన సత్పురుషుల చెవులకు శాస్త్రశ్రవణమే అలంకారం కాని కుండలాలు కావు. వారి చేతులకు సత్పాత్రదానం అలంకారంకాని కంకణాలు కావు. వారి దేహానికలంకారం పరోపకారం కాని చందనం పూసుకోవడం కాదు.

తే. ద్యుమణి పద్మాకరము వికచముగఁజేయుఁ
గుముదహర్షంబు గావించు నమృతసూతి
యర్థితుఁడు గాక జలమిచ్చు నంబుధరుఁడు
సజ్జనులు దారె పరహితాచరణమతులు 63

తా : సూర్యుణ్ని ఎవరు ప్రార్థించకున్నా అతడు తామరకొలకులను వికసింపజేస్తాడు. చంద్రుణ్ని ఎవరు వేడుకోకున్నా అతడు కలువలను వికసింపజేస్తాడు. మేఘాన్ని ఎవరు యాచించకున్నా అతడు నీటిని వర్షిస్తాడు. సత్పురుషులెప్పుడూ ఇతరులకు మేలు చేయడంలోనే ఆసక్తి చూపుతారు.

మ. తమ కార్యంబుఁ బరిత్యజించియుఁ బరార్థ ప్రాపకుల్ సజ్జనుల్
దమ కార్యంబు ఘటించుచున్ బరహితార్థవ్యాపృతుల్ మధ్యముల్
దమకై యన్య హితార్థఘాతుకజనుల్ దైత్యుల్, వృథాన్యార్థభం
గము గావించెడువార లెవ్వరో యెఱుంగన్ శక్యమే యేరికిన్? 64

తా : తమ పనులనుకూడా విడిచి ఇతరుల కార్యాలను చేసేవారు సత్పురుషులు. తమ కార్యాలకు భంగం లేకుండా ఇతరుల కార్యాలను చేసి పెట్టేవారు మధ్యములు. తమ కార్యంకోసమై పరుల కార్యాలను చెడగొట్టేవారు మనుషుల్లో రాక్షసులు. తమకు ఏమాత్రం ప్రయోజనంలేకున్నా పరుల కార్యాలను చెడగొట్టే వారికి ఏ పేరు పెట్టాలో నాకు తెలియడం లేదు.

తే. అఘమువలన మరల్చు, హితార్థకలితుఁ
జేయు, గోప్యంబు దాఁచుఁ, బోషించు గుణము,
విడువఁడాపన్ను, లేవడి వేళ నిచ్చు
మిత్రుఁడీ లక్షణంబుల మెలంగుచుండు. 65

తా: మిత్రుడు చెడుపనులనుండి నివారిస్తాడు. మంచి పనులను చేయడానికి ప్రోత్సహిస్తాడు. రహస్యాలను దాచిపెడతాడు. సద్గుణాలను పెంపొందిస్తాడు. ఆపదలోనున్నవాణ్ని ఆదుకోకుండా వదలడు. దారిద్ర్యంలో సహాయం చేసి ఆదుకుంటాడు. ఇలాంటి సద్గుణవంతుడే మిత్రుడు.

చ. క్షీరము మున్ను నీటికొసఁగెన్ స్వగుణంబులు దన్ను ఁజేరుటన్,
క్షీరము దప్త మౌట గని చిచ్చుఁజొకెన్ వెతచే జలంబు, దు
ర్వారసుహృద్విపత్తిఁగని వహ్నిఁజొరంజనె దుగ్ధ, మంతలో
నీరముఁగూడి శాంత మగు, నిల్చు మహాత్ములమైత్రి యీగతిన్ 66

తా : పాలు తనలో కలిసిన నీటికి తన గుణాలనన్నింటిని ఇస్తుంది. తనకిట్టి సహాయం చేసిన పాలు తప్తమౌతూ ఉంటే నీరంతా అగ్నిలో పడుతుంది. తనకు మిత్రుడైన నీరు నిప్పులో పడటాన్ని చూచి పాలు తానుకూడా నిప్పులో పడబోగా దానితో మళ్లీ నీరు కలపడం వల్ల శాంతిస్తుంది. సజ్జన సహవాసమనేది కూడా ఇలానే ఉంటుంది.

చ. ఒకయెడఁ బవ్వళించు హరి, యొక్కయెడన్ వసియించురాక్షస
ప్రకరము, లొక్కచో నడఁగుఁ బర్వతసంఘము, లొక్కెడన్ బలా
హకములతోడ నుండు బడబాగ్నియు; విస్తృత మూర్జితంబునుం
బ్రకటభరక్షమం బగుచు భాసిలు నౌర సముద్రమెంతయున్? 67

తా : సముద్రం అనేక విధాలుగా ఆశ్చర్యజనకంగా ఉంది. ఎలా అంటే సముద్రం ఒక్క పక్క కడుపులో పద్నాలుగు లోకాలను ధరించిన విష్ణుమూర్తి నిద్రించడానికి స్థానమిస్తుంది. వేరొకపక్క విష్ణుమూర్తికి శత్రువైన కాలకేయాదులకు విష్ణువునుండి ఏ భయమూ లేక నివసించడానికీ స్థానమిస్తుంది. ఒక వంక ఇంద్రుని నుండి తమ్ము కాపాడుకోవడానికి వచ్చిన మైనాకాది పర్వతాలనూ ధరిస్తుంది. మరొక వైపున ప్రళయకాలమేఘాలతో కూడిన బడబాగ్ని నీటిని ఎంత పీలుస్తూ ఉన్నా అంతర్ధిల్లుతుంది. ఈ విధంగానే మహాత్ములు ఎంతెంతవారికీ ఆశ్రయభూతులుగా ఉంటారు.

చ. వితతజగద్భరంబు దన వీఁపునఁ దాల్చిన కూర్మనాథుఁడున్
సతతము చంద్రభాస్కరుల చక్రముఁ ద్రిప్పు ధ్రువుండు సజ్జనుల్;
ప్రతిభ నజాండజంతు ఫల రంధ్రవసన్మ శకంబులట్ల నిం
దిత విఫలార్థసంగతి జనించి నశించుఁ దదన్య జంతువుల్. 68

తా. విస్తారమైన లోకభారాన్ని తన వీపున ధరించిన ఆది కూర్మం, ఎల్లప్పుడూ సూర్య చంద్రులనే జ్యోతిశ్చక్రాన్ని తిప్పే ధ్రువుడు - ఈ ఇద్దరే లోకంలో సజ్జనులు. తక్కిన ప్రాణులన్నీ, పరోపకారం చేయజాలనివారు కావడంచేత బ్రహ్మాండమనే అత్తిపండులోని రంధ్రాలలో ఉండే పురుగుల వలె పుట్టుతూ నశిస్తూ ఉంటారు.

శా. అశాసంహరణంబు, నోర్మియు మదత్యాగంబు, దుర్దోషవాం
ఛాశూన్యత్వము, సత్యమున్, బుధమతాచారంబు, సత్సేవయున్.
వైశద్యంబును, శత్రులాలనము, మాన్య ప్రీతియుం, బ్రశ్రయ
శ్రీశాలిత్వము, దీనులందు(గృపయున్, శిష్టాలికిన్ ధర్మముల్.69

తా : అత్యాశను వదలిపెట్టడం, ఓర్పు కలిగి ఉండడం, మదాన్ని వీడడం, పాపకార్యాలపై కోరికలు లేకుండడం,సత్యాన్నే పలకడం, పండితులు నడిచిన మార్గాననే నడవడం, సజ్జనులను సేవించడం, సంపదకలిగి ఉండడం, శత్రువులనైనా చక్కగా చూడడం - పూజ్యులను పూజించడం, పెద్దలయెడ అణకువ కలిగిఉండడం, దుఃఖితులయెడ దయ చూపడం - ఇవన్నీ సత్పురుషులలో ఉండే లక్షణాలు.

చ. హృదయవచశ్శరీరముల నెంతయుఁ బుణ్యసుధాప్రపూర్ణులై
ముదము బహూపకారముల మూఁడుజగంబులకున్ ఘటించుచున్
వదలక సాధుసద్గుణలవంబులు గొండలు సేసి మెచ్చుచున్
మదిని వికాసయుక్తులగు మాన్యులు గొందఱు వొల్తు రిద్ధరన్ 70

తా. మనోవాక్కాయకర్మల్లోను సత్కర్మాచరణమనే అమృతంతో నిండినవారై ముల్లోకాల్లో ఉన్న వారికి ఉపకారంచేస్తూ ఇతరుల్లో ఉన్న కొద్దిపాటి గుణాలనైనా కొండంత చేసి ప్రశంసిస్తూ ఆనందించే సజ్జనులు లోకంలో కొద్దిమంది మాత్రమే ఉంటారు.

తే. తనిసిరే వేల్పులు దధిరత్నములచేత?
వెఱచిరే ఘోరకాకోల విషముచేత?
విడిచిరే యత్న మమృతంబు వొడముదనుక?
నిశ్చితార్థంబు వదలరు నిపుణమతులు 71

తా : అమృతం కోసం పాలసంద్రాన్ని మథిస్తున్న దేవతలు అందులో లభించిన రత్నాలకు సంతోషించలేరు. అందులో పుట్టినకాలకూట విషానికి భయపడలేరు. అమృతం లభించేదాక తమ ప్రయత్నాన్ని వీడలేదు. ధీరులెప్పుడూ తాము తలపెట్టిన కార్యం సఫలమయ్యేవరకు తమ ప్రయత్నాన్ని వదలిపెట్టరు.

శా. ఆరంభింపరు నీచమానువులు వి ఘ్నాయాససంత్రస్తులై,
యారంభించి పరిత్యజింతు రురువి ఘ్నాయత్తు లై మధ్యముల్,
ధీరుల్ విఘ్ననిహన్యమాను లగుచున్ ధృత్యున్నతోత్సాహులై
ప్రారబ్ధార్థము లుజ్జగింపరు సుమీ ప్రజ్ఞానిధుల్ గావునన్. 72

తా : అధములైనవారు విఘ్నాలు వస్తాయన్న భయంతో అసలు పనులనే ప్రారంభించరు. మధ్యములు పనులు ప్రారంభించి విఘ్నాలు రాగానే వాటిని వదిలి పెడతారు. ధీరులైన వారు మాత్రం ఎన్ని విఘ్నాల తాకిడి కలిగినా ప్రజ్ఞానిధులు కనుక ధైర్యంతో ఉత్సాహాన్ని పెంపొందించుకొని ప్రారంభించిన పనులను వదలిపెట్టరు.

మ. ఒకచో నేలను బవ్వళించు. నొకచో నొప్పారుఁ బూసెజ్జపై
నొకచో శాకములారగించు. నొకచో నుత్కృష్టశాల్యోదనం
బొకచో బొంత ధరించు, నొక్కొకతఱిన్ యోగ్యాంబరశ్రేణి లె
క్కకు రానీయఁడు కార్యసాధకుఁడు దుఃఖంబున్ సుఖంబున్ మదిన్ 73

తా : ఎట్లైనను కార్యమును సాధించవలెనన్న పట్టుదల గలవాడు వీలునుబట్టి ఒక చోట మామూలు భూమిపై నిద్రిస్తాడు. మరొకప్పుడు అందమైన పూలపాన్పుపై నిద్రిస్తాడు. ఒకచోట కాయగూరలను ఆహారంగా గ్రహిస్తాడు. మరోచోట చక్కని శాలిధాన్యపు ఆహారాన్ని గ్రహిస్తాడు. ఒకచోట బొంత గుడ్డను ధరిస్తాడు. మరొకచోట మంచి పీతాంబరాలను ధరిస్తాడు. కష్టములు వచ్చినవని దుఃఖాన్ని గాని, సుఖములు వచ్చినవని సంతోషమును గాని పొందడు.

శా. నీతి ప్రౌఢవిహారులైన నిపుణుల్ నిందింపనీ మెచ్చనీ
ఖ్యాతిం జెందినసంపదన్ నిలువనీ గాఢంబుగా పోగనీ
ఘాతం బప్పుడ పొందనీ నియతిమైఁ గానీ యుగాంతంబునన్
నీతి శ్లాఘ్యపదంబు దప్పరు గదా నిత్యంబు ధీరోత్తముల్ 74

తా : నిందించినా, ప్రశంసించినా; సంపదలు వచ్చినా, తొలగిపోయినా; మరణమిప్పుడే వచ్చినా, కల్పాంతమందు వచ్చినా ధీరులైవారు న్యాయమార్గన్ని దాటి ఒక అడుగైనా ముందుకు పెట్టరు.

ఉ. మానవతీకటాక్షశిత మార్గణముల్ విదలింపఁ జాల వె

వ్వానిమనంబు, కోపమయవహ్ని దహింపదు, లోభపాశసం

తానము మాల్యచందనవితానములున్ వెత సేయ నోప కె

వ్వానివశంబునన్ మెలఁగు, వాఁడు జయించు జగంబు లన్నియున్. 75

తా : ఏ పురుషుని మనస్సును స్త్రీల కడగంటి చూపులనే తీక్షణములైన బాణములు ఛేదింపజాలవో, కోపమనే అగ్ని దహించదో; అత్యాశ అనే త్రాళ్లు పుష్పమాలలు, చందనాదులు వశంలో ఉంటూ ఏమీ చేయజాలవో అట్టి పురుషుడు లోకాలన్నింటిని జయిస్తాడు.

తే. నియతిచేతఁ గదర్థితుండయిన ధైర్య
పరుని ధైర్యగుణంబు మాన్పంగఁదరమె?
క్రిందు సేయంగఁబడినట్టి కృష్ణపథుని
కీల యెందైన మీఁదుగాఁ గెరలుఁగాదె! 76

తా : ధైర్యవంతునికొకప్పుడు దైవవశాత్తు దుఃఖాలు సంభవించినా అతని ధైర్యగుణాన్ని పోగొట్టడం సాధ్యం కాదు. అగ్నిని తలకిందుగా పెట్టినా దాని జ్వాల పైకి ప్రసరిస్తుందే కాని క్రిందికి ప్రసరింపదుగదా!

చ. ఉరుతరపర్వతాగ్రమునుండి దృఢంబగు ఱాతిమీఁద స
త్వరముగఁద్రెళ్లి కాయము హతంబుగఁ జేయుటమేలు, గాలిమే
పరిదొరవాతఁ గేలిడుట బాగు, హుతాశనమధ్య పాతమున్
వర మగుఁ, జారుశీలగుణవర్ణన మర్హము గాదు చూడఁగన్ 77

తా : ఎత్తైన పర్వతశిఖరంనుండి గట్టిరాతిమీద పడి దేహాన్ని వదులుకోవడం మేలు. భయంకరమైన విషజ్వాలలను వెడలగ్రక్కే కోరలుగల ఆదిశేషుని నోట చేతిని పెట్టి మరణించడం మేలు. అగ్నిలో పడిప్రాణం వదలుకోవడం మేలు. కాని సచ్ఛీలాన్ని కోల్పోవడం యుక్తం కాదు.

చ. అతనికి వార్ధి కుల్య యగు నగ్ని జలం బగు మేరుశైల మం
చితశిలలీల నుండు, మదసింహము జింక తెఱంగుఁ దాల్చుఁగో
పితఫణి పూలదండ యగు భీష్మవిషంబు సుధారసంబగున్
క్షితి జనసమ్మతంబగు సుశీల మ దెవ్వనియందు శోభిలున్ 78

తా : ఎవనిలో మంచి స్వభావం శోభిస్తూ ఉంటుందో అతనికి సముద్రం చిన్న కాలువలాగా, నిప్పు నీటిలాగా, మేరు పర్వతం చిన్న రాయిలాగ, మదించిన సింహం లేడిలాగా, కోపించిన సర్పం పూలదండలాగా భయంకరమైన విషం అమృతంలాగా ఔతుంది.

తే. ఖండితం బయ్యు భూజంబు వెండి మొలచు
క్షీణుఁడయ్యును నభివృద్ధిఁ జెందు సోముఁ
డివ్విధమున విచారించి యొడలు దెగిన
జనములకుఁదాప మొందరు సాధుజనులు. 79

తా : వృక్షాన్ని ఛేదించినా అది మళ్లీ మొలుస్తుంది. చంద్రుడు క్షీణించినా మళ్లీ కళలతో వృద్ధిపొందుతాడు. వీటిని గమనిస్తున్న సజ్జనులు కష్టదశను పొందినా వృక్షాదులవలె మళ్లీ అభివృద్ధిలోకి రావచ్చునని బాధపడరు.

ఉ. జానుగ భూతికిందొడవు సజ్జనభావము, శౌర్యలక్ష్మికిన్
మౌనము, నీతి విద్యకు, శమంబు సుబుద్ధికి, విత్తవృద్ధికిన్
దానము, దాల్మి శక్తికిని ధర్మనిరూఢి కదంభవృత్తియుం,
బూనికతోడ సర్వగుణభూషణ మెన్నఁగ శీలమే సుమీ 80

తా. సంపదకు సౌజన్యం, పరాక్రమానికి వాక్సంయమం, విద్యకువినయం, మంచి జ్ఞానానికి శాంతి, అధికధనానికి దానం, శక్తికి ఓర్పు, ధర్మాచరణకు దంభం లేకపోవడం అలంకారాలు. ఈ అలంకారాలన్నింటికన్నా శీలమే మేలైన అలంకారం.

చ. గురు(డు గురుండు, వాలు శతకోటి, సుపర్వులు వాహినీపతుల్,
సురభవనంబు గోట, మధుసూదను(డున్ సయిదోడు, దంతి ది
క్కరిపతి గా(గ నొప్పు బలఘాతియు దాయల కోడె నాజిలో
శరణము దైవమే, పురుషశక్తి నిరర్థక మెన్ని భంగులన్ 81

తా : బృహస్పతి గురువై, వజ్రాయుధము ఆయుధమై, దేవతలు సైనికులై, స్వర్గము కోటయై, విష్ణుమూర్తి తోడై, దిగ్గజములకధిపతియైన ఐరావతము గజమై తనకు తోడ్పడినా ఇంద్రుడు రాక్షసులతో జరిగినయుద్ధంలో ఓడిపోయినాడు. కావున దైవబలమే ప్రధానంకాని పురుషశక్తి ఎందుకూ పనికిరాదు.

ఉ. రాతిరి మూషకంబు వివరంబొనరించి కరండబద్ధమై
క్షీతిలి చిక్కి యాసచెడి పెద్దయు డస్సిన పామువాత సం
పాతముఁజెందె, దానిఁ దిని పాము దొలంగె బిలంబుత్రోవనే
యేతటి హానివృద్ధులకు నెక్కటి దైవము కారణంబగున్ 82

తా : ఒక రాత్రి ఒక ఎలుక ఆహారం కోసం బుట్టకు రంధ్రం చేసి అందులో దూరింది. అంతకు ముందే ఒక పాము ఆ బుట్టలో ఉన్నది. అది ఆ బుట్టలో బద్ధమై ఇరకటంతో శరీరమంతా ముద్దై బయటకు వెళ్లడానికి ఇక సాధ్యంకాక ఆకలితో శరీరపాటవం తప్పి కృశిస్తూ ఉంది. ఆ యెలుక లోపల ప్రవేశించగానే పాము దాన్ని భుజించి ఆ యెలుక చేసిన రంధ్రంగుండానే బయటకు పారిపోయింది. కావున బంధమోక్షాలకు గాని, మేలుగీళ్లకుగాని దైవమే కారణం కాని మరేమీ కాదు.

క. కందుకమువోలె సుజనుఁడు
గ్రిందం బడి మగుడ మీఁదికి న్నెగయుఁ జుమీ
మందుఁడు మృత్పిండమువలెఁ
గ్రిందం బడి యడఁగియుండుఁ గృపణత్వమునన్. 83

తా : బంతి క్రిందపడి మళ్లీ పైకెగిరిన మాదిరిగా దైవాన్ని నమ్ముకున్నవాడు హీనస్థితిని పొందినా తిరిగి వెంటనే ఉన్నస్థితిని పొందుతాడు. కాని దైవాన్ని నమ్మనివాడు మట్టిముద్ద క్రిందపడి అట్లే ఉండినట్లుగా హీనస్థితిని పొంది అట్లే ఉంటాడు. కాని మళ్లీ ఉచ్చస్థితిని పొందడు.

మ. ధర ఖర్వాటుఁడొకండు సూర్యకరసంతప్తప్రధానాంగుఁడై
త్వరతోడన్ బరువెత్తి చేరి నిలిచెన్ దాళద్రుమచ్ఛాయఁ, ద
చ్ఛిరముందత్ఫలపాతవేగమున విచ్చెన్ శబ్దయోగంబుగాఁ,
బొరి దైవోపహతుండు వోపుకడకుం బోవుంగదా యాపదల్. 84

తా : బట్టతలవాడొకడు మధ్యాహ్న సమయంలో సూర్యుని కిరణములు వేడికి తాళజాలక నీడగల ప్రదేశాన్ని కోరి తాటిచెట్టు కిందికి వెళ్లినాడు. అప్పుడే దైవికముగ ఆ చెట్టునుండి తాటిపండొకటి వేగంగా అతని తలమీద పడి వాని తల పటపటమని బ్రద్దలైంది. దైవబలం తక్కువగా ఉన్నవాడు ఎక్కడికి పోయినా అక్కడికే ఆపదలన్నీ పోతాయి.

తే. ఫణులు గజములుఁ బక్షులుఁ బట్టువడుట
రవిసుధాకరులకు నైన రాహుబాధ
బుద్ధిమంతుల లేమియుఁ బొసఁగఁజూచి
విధి బలాఢ్యుఁడటంచు భావింతు మదిని 85

తా : బంధింపశక్యంకాని గజాలు, సర్పాలు, పక్షులు - వీటి బంధనాన్ని; సూర్యచంద్రాదుల కేర్పడే గ్రహబాధను; బుద్ధిమంతులకు కలిగే దారిద్ర్యాన్ని చూస్తే దైవ ప్రభావం ఎంత గొప్పదో అర్ధమౌతుంది.

క. గుణమణిఖని యగు పూరుష
మణి ధరణికి రవణముగ నమర్చినవిధి యా
గుణవంతుని వెస(దునిమిన
గుణహీనుని(గా(గ నెన్నుకొనరే ధాతన్ 86

తా : బ్రహ్మదేవుడు సకల సద్గుణాలకు నిలయుడైన ఒక గొప్ప వ్యక్తిని భూమికి అలంకారంగా సృష్టించి వెంటనే అతనిని నశింపజేస్తాడు. అయ్యయ్యో! బ్రహ్మ ఎంత గుణహీనుడో కదా!

చ. శతభిషగాఢ్యుఁడున్ సతతశంభువతంసమునయ్యు, నోషధీ
తతులకు నాథుఁడయ్యును, సుధారస సేవధి యయ్యుఁ, దారకా
పతి దన రాజయక్ష్మ భవబాధలఁబాపఁగ గోపఁడక్కటా!
హతవిధికృత్య మెవ్వనికినైన జగంబున దాఁటవచ్చునే! 87

తా. చంద్రుని వెంట వందమంది వైద్యులుంటారు. (చంద్రుణ్ని శతభిషక్ అనే నక్షత్రం అనుసరిస్తూ ఉంటుంది) చంద్రుడు శంకరునికి అలంకారంగా ఉంటాడు. ఓషధులన్నింటికీ ఆయన రాజు. అమృతానికి నిధి. ఐనా అతడు క్షయరోగపు బాధలను అనుభవించడం తప్పడం లేదు. లోకంలో దైవవిధిని దాటడం ఎంతటివారికైనా సాధ్యమౌతుందా?

చ. కలితవిపత్తిదండపదఘట్టన సేయుచు మన్నుకైవడిన్
ఖలుఁడు విధాత పిండితముగానొనరించి నితాంతచింత యన్
బలితపుసారెపై నిలిపి పాయక దండము ద్రిప్పుచున్నవాఁ
డలమి కులాలురీతిఁ దెలియం గలవారమెయేమి సేయునో? 88

తా. ఈ మూర్ఖుడైనా బ్రహ్మ కుమ్మరివానివలె నా మనస్సునంతా ముద్దచేసి ఆపదలనే కొయ్యలతో కొడుతూ నిరంతర చింత అనే సారెపై నిలిపి తిప్పుతూ ఉన్నాడు. దేనినుద్దేశించి ఈ విధంగా చేస్తున్నాడో తెలియడం మనకు సాధ్యమా?

చ. దొసఁగులు వచ్చువేళ గుణధుర్యుల ధైర్యగుణంబు సర్వముం
బస చెడు నంచుఁజూచెదవు పాపపుదైవమ, యీ దురాగ్రహ
వ్యసనము మాను మాను, ప్రళయంబున వీతనిజక్రమంబులై
పసి సెడ వించుకంతయును సాగరముల్ గులపర్వతంబులన్.89

తా. ఓ పాపిష్ఠిదైవమా! మహాత్ములకు ఆపదలు కలిగించి వారి ధైర్యానికి హాని కలగాలని చూస్తూ ఉంటావు. కాని ఈ వ్యసనాన్ని మానుకో. కల్పాంతంలోనైనా కులపర్వతాలూ, సముద్రాలూ తమ మేరను కొంతమాత్రం కూడా దాటవు కదా!

తే. ఎవ్వనికి నిజ్జగంబున నెంతఫలము
దైవకృత మగునది వొందు దప్పకతని(
గారణము గాదు పెను(బ్రాపు ఘనుని(జేరు
చాతకమువాత(బడు నల్పజలకణములు. 90

తా. ఎవరికి ఎంత ఫలితం దైవం నిర్ణయిస్తుందో అంత ఫలితం వానికి తనంతటనే తప్పక లభిస్తుంది. దీనికి గొప్పవారిని ఆశ్రయించవలసిన అవసరం లేదు. వర్షించే మేఘాన్ని ప్రతిదినం ఆశ్రయించే చాతకపక్షి నోటిలో చిన్న నీటి బిందువులు రెండోమూడో పడతాయికాని ఎక్కువ పడవుకదా! అన్నిటికీ దైవమే నియామకం కనుక తక్కినమన ఆశ్రయాలు ఎంత పెద్దవైనా మనకు కలిగే ఫలితాలు అంతగొప్పగా ఉంటాయని తలపరాదని భావం. కావున దైవమే అందరికి శరణం.

చ. శిథిలత లేని భక్తి నతి సేయుదు వేల్పుల, కా సుపర్వులున్
విధివశవర్తు, లా విధియు విశ్రుతకర్మఫలప్రదాత, యు
య్యధికఫలంబు కర్మవశ, మట్లగుటం బని యేమి వారిచే
విధి కధికంబు గర్మమని వేమఱు మ్రొక్కి భజింతుఁ గర్మమున్. 91

తా. ఆ దేవతలకు అత్యంత భక్తి పూర్వక నమస్కారము. దేవతలుకూడా ఆ పాడు దైవానికి లోబడినవారే కనుక వారికి నమస్కరిస్తాను. ఆ దైవంకూడా కర్మానుసారంగానే ఫలాన్ని ఇస్తుంది. ఆఫలం కూడా కర్మాధీనమే. కనుక దేవతలతోనూ, దైవంతోనూ నాకేమి పని? విధికన్నా కర్మమే గొప్పది కనుక ఆకర్మనే నమస్కరించి సేవిస్తాను.

చ. నలువ కులాలుభంగి నలినప్రభవాండమునందు దేనిచే
నిలిచె, దశావతారవననిష్ఠితుఁడయ్యె మురారి దేనిచేఁ
బెలుచఁ గపాలహస్తుఁడయి భిక్షుకుఁడయ్యెఁ బురారి దేనిచే
నల రవి దేనిచేఁ దిరుగు, నా ఘనకర్మము వంద్యమే కదా. 92

తా : ఏకర్మవశంచే సృష్టికర్తయగు బ్రహ్మదేవునంతటివాడే కుండలను తయారుచేసే కుమ్మరివాని మాదిరిగా వివిధప్రాణులను సృష్టించడానికి నియమింపబడ్డాడో, ఏకర్మ ఫలితంగా విష్ణుమూర్తి దశావతారాలనే అడవిలో త్రోయబడ్డాడో, ఏ కర్మకారణంగా శివుడు చేత భిక్షాపాత్రాన్ని ధరించి బిచ్చగాడుగా తిరిగినాడో, ఏ కర్మఫలితంగా సూర్యుడు ఆకాశమార్గాన సర్వదా తిరుగుతుంటాడో అట్టి సర్వనియమనశక్తి కలిగిన కర్మకు నా నమస్కారం.

మ. ఖలునిన్ సజ్జనుఁగాఁగ, మూర్ఖజను సంఖ్యావంతునింగాఁగ, దా
యల సన్మిత్రులఁగా, నగోచరముఁ బ్రత్యక్షంబుగాఁ, బ్రాణహృ
త్కలనంబైన మహావిషం బమృతముంగాఁ జేయు సత్కర్మ ము
జ్జ్వలనిష్ఠానిధివై భజింపుము వయస్యా వాంఛితార్థాప్తికిన్ 93

తా. ఓయి మిత్రమా! నీవు కోరిన కోర్కెలను పొంద దలచుకున్నట్లైతే దుష్టులను సజ్జనులుగాను, మూర్ఖులను విద్వాంసులుగాను, శత్రువులను మిత్రులుగాను, అగోచరమైన దానిని గోచరంగాను, ప్రాణాన్ని హరించే విషాన్ని అమృతంగాను చేయగలిగిన సత్కార్యాన్ని శ్రద్ధతో ఆచరించు. ఇతర విషయాలకోసం పాటుపడకు.

చ. లలితనికేతన ప్రియవిలాసవతీధవళాతపత్రస
ద్విలసితవైభవం బనుభవింపఁబడున్ సుకృతానువృత్తిచేఁ,
జెలువగు పుణ్యకర్మమునశించిన నంగజసంగరత్రుట
త్కలితగుణోరుమౌక్తికనికాయములట్లు దొలంగు సంపదల్. 94

తా. పూర్వజన్మలో సత్కర్మలను ఆచరిస్తే వాటి ఫలితంగా మానవుడు ఈ జన్మలో మంచి మంచి మేడలు, విలాసవతులైన యువతులు, ఏకచ్ఛత్రాధిపత్యం కలిగిన రాజ్యం మొదలైన ఎన్నో వైభవాలు అనుభవించవచ్చు. సత్కర్మల ఫలం నశిస్తే ఆ మేడలు మొదలైన సకల సంపదలూ తెగిపోయిన ముత్యాల పేరులోని ముత్యాలు చెల్లాచెదరై పడిపోయినట్లుగా చెదరిపోతాయి.

తే. సగుణ నిర్గుణకార్యముల్‌సలుపు సుమతి
సేఁత పరిణతిఁ గడుఁ బ్రతీక్షింపఁదగును
బరుషకర్మవిపాకంబు ఫలముదనుక
హృదయము దహించు శల్యంబురీతి జగతి 95

తా : పండితుడైనవాడు ఒక పనిని మంచిదో, చెడ్డదో చేయదలచుకున్నప్పుడు ఆ పని పర్యవసానాన్ని బాగా ఆలోచించవలసి ఉంటుంది. తొందరపడి ఏదైనా చెడు పనిని చేస్తే దాని ఫలితం బాణం మాదిరిగా హృదయాన్ని మరణ పర్యంతమూ దహించి వేస్తూనే ఉంటుంది.

మ. చెలు వౌ రత్నఘటంబునం దతఁడు సుశ్రీఖండంబులం
దిలపిణ్యాకము వండె, నారుగల కర్థిన్ సప్తపర్ణావృతుల్
నిలిపెన్, జిల్లెడుదూదికై పుడమి దున్నెన్ బైఁడినాఁగేళ్ల, ని
మ్ముల(గర్మక్షితి(బుట్టి యెవ్వ(డు దపంబుల్ సేయ(డప్రాజ్ఞతన్ 96

తా : కర్మభూమియైన ఈ భరతఖండంలో జన్మించి కూడా ఎవడు బుద్ధిహీనుడై తపస్సును ఆచరించడో అట్టి భాగ్యహీనుడు రత్నాలతో నిర్మింపబడ్డ వంట కుండలో మంచి గంధపు కట్టెలతో తెలికపిండిని వండే వానితోనూ, కర్పూరపుటనటులను నరికి ఆళ్లకు కంచెవేయువానితోనూ, జిల్లెడు దూదికోసం బంగారు నాగలితో భూమిని దున్నేవానితోనూ సమానుడు.

తే. రమ్యరూపంబు విద్యయు రాజసేవ
కులము శీలంబుఁ జాలవు ఫల మొసంగఁ;
బూర్వపుణ్యసంచిత భాగ్యములు ఫలించుఁ
గాలమునఁ బనసాదివృక్షముల కరణి. 97

తా. పురుషునికి అందమైన రూపంకానీ, చదువుకానీ, రాజసేవకానీ, మంచి నడవడికానీ ఫలితాన్ని ఇవ్వవు. అతడు పూర్వజన్మంలో చేసుకొన్న పుణ్యంవల్ల సమకూర్చుకొన్న భాగ్యమే పనసాదివృక్షాలవలె కాలం వచ్చినప్పుడు ఫలితాన్ని ఇస్తుంది. కనుక తప్పక పుణ్యకర్మల నాచరించాలి.

చ. సలిలము(జొచ్చినం, గనక శైలము(జేరిన, వైరివీరులం
గెలిచిన, రాజసేవ(దిలకించిన, వేదములభ్యసించినం,
గళల తెలింగెఱింగిన, ఖగత్వము దాల్చిన(, గర్మనిఘ్నతా
కలన నభావ్యమైన పని గాదు వినాశము లేదు భావికిన్ 98

తా : జలస్తంభాదులచే నీటిలో మునగడం, యోగానుసంధానాదులచేత మేరు పర్వతాన్ని చేరుకోవడం, బలపరాక్రమాదులచే శత్రువీరులను జయించడం, రాజుల కొలువు సంపాదించడం, వేదాది విద్యలను నేర్వడం, చతుష్షష్టికళలను అభ్యసించడం, పాదుకాసిద్ధి చేత పక్షివలె ఆకాశంలో తిరగడం - ఈ మొదలైన వాటినన్నింటినీ మానవుడు నేర్చినా అదృష్టం లేనిదే ఏమాత్రమూ ఫలితం కలుగదు. అదృష్టమొకటి ఉన్నట్లైతే వీటికి ఫలితం కలుగనీయకుండా అడ్డుపడటం ఎవరికీ సాధ్యం కాదు.

క. కాననమున రణమున సలి,

లానలరిపుమధ్యమున మహాబ్ధినగాగ్ర,

స్థానమున మత్తు నిద్రితుఁ

బూనికతోఁ బూర్వపుణ్యములు రక్షించున్ 99

తా : అడవిలోను, యుద్ధంలోను, నీటి మధ్యలోను, అగ్ని మధ్యలోను; సముద్రంలోను; పర్వతాగ్రంలోను ఒడలు తెలియనివాణ్ని, నిద్రించేవాణ్ని పూర్వజన్మ పుణ్యములు వానికి చెఱుపు కలుగనీయక కాపాడతాయి.

తే : భవనమున(బూర్వసంభృత పుణ్యరాశి
యగుచు నుదయంబు గాంచిన సుగుణనిధికి
వనము పురమగు(, బరులాత్మజనము లగుదు,
రవని నిధిరత్న పరిపూర్ణ యయి ఫలించు. 100

తా. ఎవనికి పూర్వజన్మలో సంపాదించుకోబడిన సుకృత సంపద సమృద్ధిగా ఉంటుందో అట్టి సుగుణశాలికి అడవి నగరంగాను; శత్రువులు ఆత్మీయులుగాను, భూమి అంతా నిధులతోను, రత్నాలతోను నిండినదిగాను అగును.

శ్రీ పావని సేవా సమితి
ప్రచురణలు

1. గజేంద్ర మోక్షము సంస్కృత మూల సహితము వ్యాఖ్యాత - "మహాకవి" ఉత్పల సత్యనారాయణాచార్య వెల : రూ. 100/-
2. శ్రీకృష్ణశతకము-వ్యాఖ్యాత "మహాకవి" ఉత్పల సత్యనారాయణాచార్య - వెల : రూ. 50/-
3. దాశరథి శతకము - వ్యాఖ్యాత ఆచార్య ఎమ్. కులశేఖర రావు వెల : రూ. 50/-
4. సర్వేశ్వర శతకము - వ్యాఖ్యాత డా॥ ముదిగొండ వీరభద్రయ్య వెల : రూ. 50/-
5. సుమతి శతకము - వ్యాఖ్యాత "ఆంధ్ర వ్యాస" శ్రీ ఏలూరిపాటి అనంతరామయ్య - వెల : రూ. 50/-

102

6. **నరసింహ శతకము** - వ్యాఖ్యాత డా॥ కసిరెడ్డి వెంకటపతి రెడ్డి - వెల : రూ. 50/-

7. **నారాయణ శతకము** - వ్యాఖ్యాత ఆచార్య కె.వి. రాఘవాచార్యులు- వెల: రూ 50/-

8. **వేమన శతకము** - వ్యాఖ్యాత డా॥ కసిరెడ్డి వెంకటపతి రెడ్డి- వెల : రూ. 50/-

9. **భాస్కర శతకము**- వ్యాఖ్యాత డా॥ తిరుమల శ్రీనివాసాచార్య- వెల : రూ. 50/-

10. **భర్తృహరి నీతి శతకము** - వ్యాఖ్యాత డా॥ రవ్వా శ్రీహరి- వెల : రూ. 50/-

11. **శ్రీ కాళహస్తీశ్వర శతకము** -వ్యాఖ్యాత డా॥ వల్లపురెడ్డి బుచ్చారెడ్డి వెల : రూ. 50/-

12. **శ్రీ రుక్మిణీ కల్యాణము** - వ్యాఖ్యా ఆచార్య కె.వి. రాఘవాచార్యులు - వెల : రూ.100/-

శ్రీ చల్లా సాంబిరెడ్డి
సంపాదకులు